

గెలుపుపై ముగ్గురు అభ్యర్థుల్లోనూ ధీమా

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పది మంది పోటీ చేశారు. వీరిలో సిట్టింగ్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు, కోరెడ్ల విజయగౌరి మధ్యే ప్రధాన పోటీ నెలకొందని ఎన్నికల విశ్లేషకులు చెబుతున్నారు. గెలుపుపై ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్నారు. రఘువర్మకు కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్యులైన టీడీపీ, జనసేన పార్టీలు, గాదె శ్రీనివాసులనాయుడుకి బీజేపీలో ఉండే ఆర్ఎస్ఎస్‌కు చెందిన కొందరు నాయకులు మద్దతు పలికారు. విజయగౌరి మద్దతుగా సీపీఎంతోపాటు కొన్ని వామపక్షాలు పనిచేశాయి.


రఘువర్మ
శ్రీనివాసుల నాయుడు
విజయగౌరి

గురువుల విజేత ఎవరో?

● నేడు ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ● ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాట్లు పూర్తి


ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపునకు పూర్తయిన ఏర్పాట్లు

విశాఖపట్నం/ విజయనగరం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఇటీవల జరిగిన ఎన్నికల్లో పోలైన ఓట్ల లెక్కింపు సోమవారం ఉదయం ప్రారంభం కానున్నది. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల ట్రిపుల్ ఈ విభాగంలో ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు చేశారు. ఈ కేంద్రాన్ని విశాఖ జిల్లా డీఆర్వో భవానిశంకర్ ఆదివారం పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. గత నెల 27న శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లోని 123 పోలింగ్ కేంద్రాల్లో జరిగిన ఎన్నికల్లో 22,493 మంది ఉపాధ్యాయులకుగాను 20,794 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 13,508 మందికిగాను 12,576 మంది, మహిళలు 8,985 మందికి 8,218 మంది ఓటు వేశారు.

- మొత్తం ఓటర్లు: 22,493, పోలైన ఓట్లు: 20,794
- ఓట్ల లెక్కింపునకు 20 టేబుళ్లు, 100 మంది సిబ్బంది
- తొలుత బ్యాలెట్ పత్రాలను కుప్పగా పోసి.. 25 చొప్పున కట్టలు
- డ్రమ్ములో వేసి కలియతిప్పిన తరువాత టేబుళ్లకు సర్దుబాటు
- తొలి ప్రాధాన్యతలో 50 శాతానికి మించి ఒక్క ఓటు వచ్చినా విజేతగా ప్రకటింపు
- ఇదే జరిగితే రాత్రి ఎనిమిది గంటల్లో ఫలితం వెలువడే అవకాశం
- లేకపోతే రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు
- ఫలితం వెల్లడికి మరింత సమయం

ఓట్ల లెక్కింపునకు 20 టేబుళ్లు

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపునకు అధికారులు 20 టేబుళ్లను ఏర్పాటు చేశారు. ఒక్కో టేబుల్ వద్ద ఇద్దరు చొప్పున సిబ్బంది ఉంటారు. వీరికి అదనంగా మరికొంత మంది సిబ్బందిని అందుబాటులో ఉంచుతారు. తొలుత సోమవారం ఉదయం అభ్యర్థుల సమక్షంలో స్ట్రాంగ్‌రూమ్ ఓపెన్‌చేసి అక్కడ నుంచి బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ హాలుకు చేరుస్తారు. ఉదయం ఎనిమిది గంటలకు బ్యాలెట్ బాక్సుల సీళ్లను పరిశీలించి, అన్నీ సక్రమంగా ఉంటే తెరుస్తారు. అన్ని బాక్సుల్లోని బ్యాలెట్ పత్రాలను కుప్పగా పోస్తారు. తరువాత 25 చొప్పున ఓట్లను కట్టలుగా కడతారు. ఈ ప్రక్రియ పూర్తయిన తరువాత ఓట్ల కట్టలను డ్రమ్ములో వేసి కలియతిప్పుతారు. అనంతరం ఒక్కో టేబుల్‌కు వెయ్యి ఓట్లు. అంటే 40 కట్టలను అందజేస్తారు. ఈ ప్రక్రియ పూర్తయ్యేసరికి మధ్యాహ్నం అయ్యే అవకాశం ఉంది. భోజనం చేసిన తరువాత టేబుళ్ల వారీగా ఓట్ల లెక్కింపు మొదలుపెడతారు. అభ్యర్థులకు వచ్చిన తొలి ప్రాధాన్యత ఓట్లను వారికి కేటాయించిన ట్రేలలో వేస్తారు. మిగిలిన ఓట్ల కట్టలను కూడా టేబుళ్ల వారీగా సర్దుబాటు చేస్తారు. తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు మొత్తం ఒక రౌండ్‌లోనే చేపడతారు. చెల్లిన ఓట్లలో 50 శాతానికి మించి ఒక్క ఓటు అదనంగా ఎవరికి వస్తే ఆ అభ్యర్థిని విజేతగా ప్రకటిస్తారు. ఇదే జరిగితే రాత్రి ఎనిమిది గంటలకల్లా ఫలితం వెలువడే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఒకవేళ ఎవరికీ 50 శాతం కన్నా ఎక్కువ ఓట్లు రాకపోతే మొదటి ప్రాధాన్యత ఓట్లలో తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థి నుంచి రెండో ప్రాధాన్యత ఓట్లను లెక్కిస్తారు. ఈ విధంగా ఒక్కొక్కరిని ఎలిమినేట్ చేసుకుంటూ వస్తారు. మొదటి స్థానంలో ఉన్న అభ్యర్థి ఎప్పుడైతే 50శాతం ఓట్లను అధిగమిస్తారో అప్పుడు రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపును నిలుపుదల చేసి, ఆ అభ్యర్థిని విజేతగా ప్రకటిస్తారు.

● భారీ బందోబస్తు నడుమ..

ఈ ఎన్నికలకు రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్న విశాఖపట్నం కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ నేతృత్వంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరిస్తున్న శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల డీఆర్వోలు, ఇతర అధికారులు కౌంటింగ్ కేంద్రంలో ఉంటారు. ఎన్నికల సంఘం తరపున పరిశీలకునిగా వచ్చిన సీనియర్ ఐఏఎస్ అధికారి ఎంఎం.నాయక్ కౌంటింగ్‌ను పర్యవేక్షిస్తారు. మొత్తంగా 100మంది అధికారులు, సిబ్బంది కౌంటింగ్ విధుల్లో ఉంటారు. కౌంటింగ్ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా 200 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికల్లో పోటీచేసిన పది మంది అభ్యర్థుల తరఫున మొత్తం 160 మందికి కౌంటింగ్ ఏజెంట్ పాసులు జారీ చేశారు.

కనకమహాలక్ష్మి జాతర ప్రారంభం

● తొలిరోజు దర్శనానికి పోటెత్తిన భక్తులు


ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు, (ఇన్‌సెట్)లో పూజలందుకుంటున్న కనకమహాలక్ష్మి అమ్మవారు

చీపురుపల్లి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి ఇలవేల్పు కనకమహాలక్ష్మి అమ్మవారి 27వ జాతర మహోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున రెండు గంటల సమయంలో ఆలయ కమిటీ తొలి పూజలు నిర్వహించింది. వేకువ జామున నాలుగు గంటల నుంచే భక్తులు దర్శనం కోసం పెద్ద ఎత్తున బారులు తీరారు. ఉచిత దర్శనంతో బాటు వంద, యాభై, ఇరవై, పది టికెట్ల క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు, జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున, జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ, సర్పంచ్ మంగళగిరి సుధారాణి, జడ్పీటీసీ వలిరెడ్డి శిరీష తదితరులు కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. ఆలయ అర్చకుడు ఆరవెల్లి రవికుమార్ పూజలు చేయించారు. కాగా తొలి రోజున ప్రభ సంబరాలు ఘనంగా జరిగాయి. జంగిళ్లతో అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటం ఆకట్టుకుంది.

● వీఐపీల కోసం ఏర్పాటు చేసిన క్యూలో కోకొల్లలుగా భక్తుల్ని విడిచిపెట్టడంతో గందరగోళం చోటుచేసుకుంది. వీఐపీల పేరుతో సామాన్య భక్తుల్ని విడిచిపెట్టడం వల్ల వంద రూపాయల లైన్లో ఉన్న భక్తులు అసహనం వ్యక్తం చేశారు.

7న ఎల్లమ్మతల్లి సిరిమానోత్సవం

7లో

● ప్రకటించిన నిర్వహణ కమిటీ సభ్యులు

గోవుల ఘోష



- కబేళాలకు తరలిపోతున్న మూగజీవులు
- మార్కెట్‌లో బహిరంగంగా అమ్మకాలు
- దూడలనూ విక్రయానికి పెడుతున్న వైనం
- మొక్కుబడిగా అధికారుల నిఘా

గజపతినగరం, మార్చి2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మూగజీవాల వ్యాపారం యథేచ్ఛగా సాగుతోంది. అన్ని ప్రాంతాల నుంచి కబేళాలకు తరలుతున్నాయి. పెదమానాపురం, అలమండ, అచ్యుతాపురం సంతలు ఇందుకు కేరాఫ్‌గా పేరొందాయి. ఈ మార్కెట్లలో భారీగా ఆవుల విక్రయాలు జరుగుతున్నాయి. అక్కడి నుంచి వ్యాపారులు ఆవులను కబేళాలకు తరలిస్తున్నారు. కొన్ని విజయనగరం తీసుకువెళ్తున్నట్లు సమాచారం. అక్కడి నుంచి మాంసం రూపంలో ఇతర రాష్ట్రాలు, దేశాలకు ఎగుమతి అవుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు మార్కెట్లకు ఆవులను తరలించే క్రమంలో దారి మధ్యలో ఎక్కడైనా పోలీసులకు చిక్కినా నాయకులు, వ్యాపారుల నుంచి ఒత్తిళ్లతో చూసీ చూడనట్లు వదిలేస్తున్నారు. దీంతో కబేళా వ్యాపారం నిరాటంకంగా సాగుతోంది. గతంలో ఒట్టిపోయిన పశువులను, వ్యవసాయ పనులకు ఉపయోగపడని వాటినే కబేళాకు తరలించేవారు. నేడు ఆ పరిస్థితి లేదు. దూడలను సైతం అమ్మేస్తున్నారు. అందులోనూ మగ దూడ అయితే పుట్టిన కొద్దిరోజులకే కబేళాకు తరలిస్తున్నారు. దత్తిరాజేరు మండలం పెదమానాపురం నుంచి కబేళాలకు అత్యధికంగా తరలిపోతున్నాయి. ఒడిశా, ఇతర రాష్ట్రాల నుంచి పశువులను గురువారం నుంచి సంత ప్రాంతానికి చేర్చుతుంటారు. శనివారం ఆవులను ఏకమొత్తంగా అమ్మేస్తారు. ఆపై వ్యాపారులు భారీ వాహనాల్లో ఇతర రాష్ట్రాలకు తరలించుకుపోతున్నారు. కొందరు సోమవారం జరిగే అలమండ సంతకు అడ్డదారుల్లో కాలినడకన పశువులను తోలుకెళ్తున్నారు.

కానరాని నిఘా

పశువుల మార్కెట్‌లపై నిఘా (మిగతా 8వ పేజీలో..)

జిల్లాలో అత్యధికంగా గోవుల రవాణా జరుగుతోంది. ఇతర రాష్ట్రాలకు, దేశాలకు సైతం తీసుకుపోతున్నారు. కేవలం మాంసం కోసమే వాటిని వినియోగించడం అత్యంత దయనీయం. దూడపెయ్యల నుంచి నడి వయసు ఆవులు, గేదెలను కూడా కబేళాలకు చేర్చుతున్నారు. రవాణాలో సైతం వాటికి నరకం చూపెడుతున్నారు. మార్కెట్‌లో పరిస్థితి మరింత దారుణం. విక్రయించేందుకు తీసుకొచ్చిన వాటికి గడ్డి కూడా వేయడం లేదు. తాగడానికి నీళ్లూ అందించడం లేదు. కొన్ని సంవత్సరాలుగా జిల్లాలో ఈ వ్యవహారం నడుస్తున్నా అధికారులు కట్టడి చేయలేకపోతున్నారు.

అక్రమంగా తరలిస్తే చర్యలు

నిబంధనలను అతిక్రమించి పశువులను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఇటీవల పశువుల కబేళాలను గుర్తించి ఆ వాహనాలను సీజ్ చేశాం. అలాగే వాహనదారులపై కేసులు నమోదు చేశాం. పశు అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టాం. గతేడాదిలో 31, ఈఏడాది రెండునెలల్లో 13 కేసులు నమోదు చేశాం.

- రమణ, సీఐ, గజపతినగరం


గజపతినగరం: అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు గుర్తించిన పశువులు

లైసెన్స్‌లు లేకుండానే రవాణా

లైసెన్స్ లేకుండా కబేళాలకు పశువులను తరలిస్తున్నారు. ఇది చట్ట రీత్యా నేరం. కొందరు అధికారులు మామూళ్ల మత్తులో పడి పట్టించుకోవడం లేదు. చిన్న వాహనాల్లో ఎక్కువ పశువులను తరలిస్తే కేసులు నమోదు చేయాలి. పశువుల అక్రమ రవాణాపై ఆర్టీవో, పోలీసులు నిఘా పెట్టాలి.

- లోగిశ రామకృష్ణ, గోసంరక్షణ సమాఖ్య అధ్యక్షుడు

వా(బ)ర్డెన్



- 121 మంది ఉండాలి.. 78 మంది ఉన్నారు
- ఉమ్మడి జిల్లాలో తీవ్ర కొరత
- ఉన్నవారిపై అదనపు భారం
- ఒక్కొక్కరికీ రెండు హాస్టళ్ల బాధ్యతలు

ఉమ్మడి జిల్లాలోని హాస్టళ్లలో వార్డెన్ల కొరత తీవ్రంగా ఉంది. కొన్నేళ్లుగా నియామకం జరగడం లేదు. 41 హాస్టళ్లకు పూర్తిగా వార్డెన్లు లేరు. రాజాం ప్రభుత్వ ప్రత్యేక బీసీ హాస్టల్‌లో పనిచేస్తున్న వార్డెన్ రేగిడి మండలం ఏపీపురం హాస్టల్, వంగర మండలం ఎం.సీతారాంపురం హాస్టల్‌కు ఇన్‌చార్జిగా ఉన్నారు. సంతకవిటి మండలం సిరిపురం హాస్టల్ వార్డెన్ అదే మండలం గుళ్ల సీతారాంపురం ఎస్సీ బాలుర హాస్టల్ వార్డెన్‌గా ఇన్‌చార్జి బాధ్యతలు చూస్తున్నారు. తెర్లాం హాస్టల్ వార్డెన్‌గా ఉన్న వ్యక్తి రాజాం ఎస్సీ ప్రత్యేక బాలుర హాస్టల్ వార్డెన్‌గా ఇన్‌చార్జి బాధ్యతలు చూస్తున్నారు. ఈ విధంగా జిలాల్లో ఒక్కో వార్డెన్ రెండు మూడు వసతిగృహాల ఇన్‌చార్జి బాధ్యతలు మోస్తున్నారు.



రాజాం, మార్చి2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాలపై సరైన పర్యవేక్షణ ఉండడం లేదు. పూర్తిస్థాయిలో వార్డెన్లు లేరు. రెండు, మూడు హాస్టళ్లకు ఒక వార్డెన్ విధులు నిర్వహిస్తున్నారు. దీంతో మెనూ అమలు, హాస్టళ్ల నిర్వహణ అస్తవ్యస్తంగా మారుతోంది. అంతిమంగా విద్యార్థులపై ఆ ప్రభావం పడుతోంది. ఆహారం పరిమాణం, నాణ్యత తగ్గుతోంది. వసతి కూడా సక్రమంగా లేదు. హాస్టళ్లలో విద్యార్థులు క్రమశిక్షణ తప్పుతున్నారు. ఉమ్మడి జిల్లాలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, ప్రీ మెట్రిక్‌కు సంబంధించి 121 వసతిగృహాలు ఉన్నాయి. అందులో 5,151 మంది విద్యార్థులు వసతిపొందుతున్నారు. వీటిలో 43 హాస్టళ్లకు అసలు వార్డెన్లు లేరు. వార్డెన్ ప్రతిరోజూ ఉదయం నుంచి రాత్రి వరకూ దగ్గరుండి పిల్లల సంరక్షణ బాధ్యత చూసుకోవాల్సి ఉంటుంది. తక్కువ మంది సిబ్బంది ఉండడంతో మిగతావారిపై భారం పడుతోంది. ప్రతి హాస్టల్‌లో వార్డెన్, డిప్యూటీ వార్డెన్, కుక్, సహాయకులు, నైట్ వాచ్‌మెన్ ఉండాలి. దగ్గర్లో ఉన్న పీహెచ్‌సీ ఏఎన్ఎంలు విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తుండాలి. కాని వార్డెన్లు అరకొరగా ఉండగా.. మిగతా సిబ్బంది కాంట్రాక్ట్ ప్రతిపాదికన పనిచేస్తున్నారు. రెండు మూడు హాస్టళ్ల బాధ్యతలు అప్పగించడంతో పూర్తిస్థాయిలో సమయాన్ని కేటాయించలేకపోతున్నారు. దీనివల్ల విద్యార్థులు గాడి తప్పుతున్నారు. కిందిస్థాయి సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. గత 20 ఏళ్లగా వార్డెన్ నియామకాలు చేపట్టడం లేదు. పదవీ విరమణ పొందిన వారి స్థానంలో కొత్త వారు రావడం లేదు. కొత్త నియామకాలపై ప్రభుత్వం దృష్టిపెట్టడం లేదు.

కొరత వాస్తవమే..

ఉమ్మడి జిల్లాలో వార్డెన్ల కొరత ఉంది. ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాం. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం.

పెంటోజీరావు, జిల్లా సంక్షేమ శాఖ అధికారి, విజయనగరం

ప్రాణికోటిపై దయతో మెలగండి

7లో

● త్రిదండి చిన్నజీయర్‌స్వామి



నేటి నుంచి తెరుచుకోనున్న జూట్ మిల్లు

● నిర్వహణ పనులకు కార్మికులను ఆహ్వానించిన యాజమాన్యం



7లో

సర్వే చేశారు.. వదిలేశారు

● ఆక్రమణలు గుర్తించినా తొలగించని అధికారులు

● ఇదీ మదనాపురం నీలకంఠరాజు చెరువు పరిస్థితి

8లో



రహదారిపైనే వాహనాలు


ప్రధాన రహదారిలో నిలిపిన వాహనాలు

● స్థానికులకు తప్పని ఇక్కట్లు

భోగాపురం, మార్చి2 (ఆంధ్రజ్యోతి): భోగాపురం ప్రధాన రహదారిపై వాహనాలు నిలుపుదల చేస్తుండటంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. దీంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఆ రోడ్డులో వెళ్లేందుకు భయపడుతున్నారు. సెలవు రోజు తప్ప మిగిలిన రోజుల్లో ఆ రోడ్డు మీదుగా ప్రయాణించాలంటే కొంత సమయం నిరీక్షించాల్సిందే. ఇదే రోడ్డులో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, ప్రైవేట్ ఆసుపత్రి, పోస్టాఫీస్ ఉన్నాయి. దాంతో వారందరూ తమ వాహనాలను రోడ్డుపై నిలుపుతున్నారు. ఉదయం మొదలు రాత్రి వరకూ వాహనాల రద్దీ ఉంటోంది. కాగా.. ప్రధాన రహదారి కావడంతో స్కూల్ బస్‌లు, ఇతరత్రా వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. పర్యవసానంగా ఇక్కడ నిత్యం ట్రాఫిక్ చిక్కులే. ఈ విషయంలో సంబంధిత అధికారులు స్పందించి ఈ రోడ్డులో వాహనాల రాకపోకలు సజావుగా సాగేలా చర్యలు చేపట్టాల్సి ఉంది.

అన్నదాన సత్రానికి బియ్యం వితరణ

రేగిడి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండలంలో వావిలవలస రాహుల్ సౌరబ్ అన్నదాన సత్రానికి తిరుమల తిరుపతి దేవస్థానం జేఈవో సీసీ లోకేశ్‌బాబు బియ్యం వితరణ చేశారని సత్రం నిర్వాహకుడు, సామాజిక కార్యకర్త పాలూరి సిద్ధార్థ తెలిపారు. ఈమేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తిరుమల వెళ్లే భక్తులకు రూమ్స్, టికెట్లు అందజేశారన్నారు.

బడ్జెట్‌లో కార్మికులకు మొండిచేయి

రాజాం రూరల్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కార్మిక, కర్షకవర్గాలకు మొండిచేయి చూపించిందని కార్మిక నాయకుడు రామ్మూర్తినాయుడు ఓ ప్రకటనలో ఆరోపించారు. ఆశ, వీవీవో, మెప్మా, శానిటేషన్ వర్కర్లు, గ్రీన్ అంబాసిడర్, ఫీల్డ్ అసిస్టెంట్లు, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు, కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ సిబ్బందితో పాటు భవన నిర్మాణ కార్మికులు, ముఠా, కలాసీ, హోటల్స్ పెట్రోల్ బంకుల్లోని కార్మికులకు ప్రభుత్వం ఎలాంటి ప్రయోజనం చేకూర్చలేదన్నారు. బడ్జెట్ ప్రవేశపెడుతున్న సమయంలో తమకు వేతనాలు పెరుగుతాయని ఆశించిన ఆయా రంగాల కార్మికులు ఉసూరుమన్నారన్నారు.

ప్రభుత్వ నిర్ణయంపై హర్షం

లక్కవరపుకోట, మార్చి 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న సుమారు 45 వేల మందికి పైగా ఆశా వర్కర్ల సమస్యలపై ముఖ్యమంత్రి స్పందించి గ్రాట్యూటీ ప్రకటించడం హర్షణీయమని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి గాడి అప్పారావు తెలిపారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ సాహసోపేత నిర్ణయాన్ని స్వాగతించారు. మెటర్నటీ సెలవులు, గ్యాట్యూటీ, ఉద్యోగ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచడం ఆశ్చర్యకరమైన విషయమన్నారు.

అంకెలు ఎక్కువ.. సంక్షేమం తక్కువ

విజయనగరం దాసన్నపేట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట బడ్జెట్‌లో అంకెలు ఎక్కువ.. సంక్షేమం తక్కువని దళిత బహుజన శ్రామిక యూనియన్ (డీబీఎస్‌యూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.చిట్టిబాబు విమర్శించారు. ఆదివారం నగరంలోని యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బడ్జెట్‌లో కేటాయించిన నిధుల్లో సాధారణ పథకాలకే సింహభాగం వెచ్చించారన్నారు. ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ అమలుకు నిధులు కేటాయించలేదన్నారు. సమావేశంలో యూనియన్ ప్రతినిధులు వరలక్ష్మి, సూర్యచంద్ర, రమ్య, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

మిమ్స్‌లో సదస్సు

నెల్లిమర్ల, మార్చి 2(ఆంధ్రజ్యోతి): స్థానిక మిమ్స్‌లో న్యూరో అనస్థీషియా సదస్సు ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డీన్ డాక్టర్ లక్ష్మీకుమార్ హాజరయ్యారు. ఇందులో సుమారు 300 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. సదస్సులో రాష్ట్రంతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కన్సల్టెంట్‌లు వివిధ అంశాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా కళాశాల అనస్థీషియా ఆచార్యుడు కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ సదస్సు పోస్టు గ్రాడ్యుయేట్ విద్యార్థులకు మత్తు వైద్యులకు ఎంతో ఉపకరిస్తుందన్నారు. సదస్సులో ఐఎస్‌ఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సూరిశెట్టి శ్రీనివాసరావు, డాక్టర్ రాజేశ్, డాక్టర్ మీనాక్షి సుందరం, డాక్టర్ విష్ణు, మహేష్ ఐఎస్ఏ పూర్వ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ఎన్‌సీ చక్రరావు, డాక్టర్ భీమేశ్వర్, డాక్టర్ ఎఎస్.కామేశ్వరరావుతో పాటు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం

భోగాపురం, మార్చి2 (ఆంధ్రజ్యోతి): మండలంలో రాజాపులోవలో అగ్ని ప్రమాద బాధితుడు జంకాల అప్పన్నకు జనసేన నాయకులు ఆదివారం రూ.10 వేలు ఆర్థిక సాయంతో పాటు నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వందనాలరమణ, బొల్లు త్రినాథ్, మాతా నవీన్, రాధాకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

వృద్ధులకు నిత్యావసర సరుకులు

కొత్తవలస, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మికాపల్లి, వినాయకనగర్‌లోని షర్ ది ఛారిటబుల్ ట్రస్టు ద్వారా ఆదివారం 42 మంది వృద్ధులకు నిత్యావసర సరుకులు, వస్త్రాల పంపిణీ జరిగింది. వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జి.సూరిబాబు, గవర రామకృష్ణ, శివాజీ వాటిని సమకూర్చారు. ట్రస్టు ద్వారా నిత్యావసర సరుకులు, వస్త్రాలు అందించడం సంతోషంగా ఉందని వారన్నారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ హరికుమార్ పాల్గొన్నారు.

ప్రాణికోటిపై దయతో మెలగండి

● త్రిదండి చిన్నజీయర్‌స్వామి


చీపురుపల్లిలో ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తున్న చిన్నజీయర్‌స్వామి

రాజాం రూరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ప్రాణికోటి పట్ల దయతో మెలగడం ద్వారా పర్యావరణ సమతుల్యాన్ని పొందవచ్చని త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి పిలుపునిచ్చారు. మాధవసేవగా సర్వప్రాణి సేవ, స్వీయ ఆరాధన, సర్వఆరాధన లక్ష్యాలతో వికాస తరంగిణి సేవలందిస్తోందని జీయర్‌స్వామి స్పష్టం చేశారు. ఇక్కడి వికాస తరంగిణి కార్యాలయాన్ని ఆదివారం ఆయన సందర్శించి అనుగ్రహ భాషణం చేశారు. దేశవాళీ గోవులను సంరక్షించడం ద్వారా భూసారాన్ని పెంచడంతో పాటు రేడియేషన్ తగ్గించుకోవచ్చని గుర్తు చేశారు. మహిళలో వచ్చే సర్వైకల్, బ్రెస్ట్ కేన్సర్లను ప్రారంభ దశలో గుర్తించేందుకు వీలుగా మహిళా ఆరోగ్యవికాస్ కార్యక్రమాలను విస్తృతం చేయాల్సిన అవసరాన్ని స్వామి గుర్తుచేశారు. కార్యక్రమంలో పనసలవలస పీఠాధిపతి తిరుమల రంగనాథంతో పాటు పలువురు వికాసతరంగిణి సభ్యులు పాల్గొన్నారు.

కుటుంబాన్ని తీర్చిదిద్దే బాధ్యత మహిళలదే..

●చీపురుపల్లి: కుటుంబాన్ని, పిల్లలను తీర్చిదిద్దే బాధ్యత ప్రధానంగా మహిళలదేనని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్‌స్వామి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఓ ప్రైవేట్ కార్యక్రమంలో ఆయన ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. మహిళలు మంచి ఆహారాన్ని తీసుకోవడంతో పాటు కుటుంబానికి ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించాలన్నారు. పిల్లలకు మంచి విద్యాబుద్ధులు నేర్పించేందుకు మహిళలు శ్రద్ధ చూపించాలన్నారు.

యోగాతో ఆరోగ్యం: ఎస్పీ

విజయనగరం క్రైం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): యోగా శరీరానికి, మనస్సు, ఆత్మకు శాంతి కలిగించే ప్రాచీన సాధనమని దీంతో అనారోగ్య సమస్యలు అధిగమించవచ్చునని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. సాధికారిత వారోత్సవాల్లో భాగంగా మహిళలకు ప్రత్యేకంగా యోగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాతో హార్మోన్ల సమతుల్యత సాధ్యమవు తోందన్నారు. థైరాయిడ్, ఆందోళన, ఒత్తిడి, నిద్ర సమస్యలు తగ్గుతాయన్నారు. మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. నిరంతర యోగా సాధన వల్ల మహిళ ల్లో ఆలోచన శక్తి, ఏకాగ్రత పెరుగుతుందన్నారు. సమర్థమైన వ్యక్తులుగా రాణిస్తారన్నారు. మహిళా పోలీసు స్టేషన్ సీఐ నర్సింహమూర్తి ఆధ్వర్యంలో యోగా శిక్షకులు, మహిళా పోలీసు అధికారులు, సిబ్బందికి ప్రత్యేక యోగా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్ఐ గోపాలనాయుడు, ఎస్ఐలు పద్మావతి, నర్సింగరావు, ఆర్ఎస్ఐ రమేష్, మహిళా సిబ్బంది పాల్గొన్నారు.

క్రమశిక్షణకు ఎన్‌సీసీ దోహదం


ఎన్‌సీసీ పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

రాజాం రూరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థుల్లో క్రమశిక్షణ పెంపొందడానికి ఎన్‌సీసీ ఎంతో దోహదపడుతుందని 14వ ఆంధ్రా బెటాలియన్ లెఫ్టినెంట్ ఆర్‌సీహెచ్. సురేష్‌కుమార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఎన్‌సీసీ-ఏ సర్టిఫికెట్ పరీక్షలకు చీఫ్ ఎగ్జామినర్‌గా ఆయన హాజరై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. రెండో విడతలో 253 మంది విద్యార్థులకు రాత, డ్రిల్ పరీక్షలు నిర్వహించారు. రాజాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో పాటు సన్ స్కూల్, కొల్లివలస ఉన్నత పాఠశాల, గరివిడి గోదావరి షరాఫ్ పాఠశాలల విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షల నిర్వహణలో ఎగ్జామినర్ అచ్యుతకుమార్, సుబేదార్ జితేంద్ర, మల్లి, శ్రీను, హరికృష్ణ, పుష్పలత, ఉదయ్‌కుమార్, సంతోషి తదితరులు పాల్గొన్నారు.

గుండెను భద్రంగా ఉంచుకోండి


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ అనురాధ

జామి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ గుండెను భద్రంగా చూసుకోవాలని గుండె వైద్య నిపుణురాలు ధరిమిరెడ్డి అనురాధ సూచించారు. ఆదివారం జామిలో విశాఖకు చెందిన మహేంద్ర ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గుండె సంరక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ మహేంద్ర, పి.అప్పలనాయుడు, ఆనందరావు, రామకృష్ణ రెడ్‌క్రాస్ సభ్యుడు మురళీ తదితరులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కోండ్రు

రాజాం/ రేగిడి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రేగిడి మండలం కొర్లవలస గ్రామానికి చెందిన బంకి లక్ష్మి అనారోగ్యానికి గురైన నేపథ్యంలో ఆమెకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.81 వేలు మంజూరయ్యాయి. ఆదివారం టీడీపీ కార్యాలయంలో సంబంధిత చెక్కును బాధిత మహిళకు ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అందజేశారు. అనంతరం జామియా మసీదుకు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన రూ.5 వేలు గౌరవ వేతనం చెక్కును ఇమామ్ మహ్మద్ యస్సీన్, మౌజర్ అబ్ రహీమ్‌కు అందజేశారు. కార్యక్రమంలో తూర్పుకాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోళ్ల అప్పలనాయుడు, పిన్నింటి మోహన్‌రావు తదితరులున్నారు.

కోండ్రుకు జాతర ఆహ్వానపత్రిక

రాజాం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రాజాంలో ఈనెల 9, 10, 11 తేదీల్లో నిర్వహించనున్న పోలిపల్లి పైడితల్లి అమ్మవారి జాతరకు హాజరుకావాలని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్‌కు ఆదివారం పార్టీ కార్యాలయంలో సలాది వెంకటరమణ కళాపరిషత్ కమిటీ ప్రతినిధులు ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు సలాది తులసీదాస్, ఆర్నిపల్లి వెంకటనాయుడు, కోళ్ల అప్పలనాయుడు, మక్క అప్పలనాయుడు, పొగిరి సురేష్‌బాబు పాల్గొన్నారు.

జనసేనలో పలువురి చేరిక


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే నాగమాధవి

పూసపాటిరేగ, మార్చి2 (ఆంధ్రజ్యోతి): పేరాపురం సర్పంచ్ శ్రీరామమూర్తితో పాటు ఉప సర్పంచ్ కోరాడ సంతోషి, ఎనిమిది మంది వార్డు సభ్యులు ఆదివారం ఎమ్మెల్యే లోకం నాగమాధవి సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వారితో పాటు సుమారుగా 50 కుటుంబాలు పార్టీలో చేరారు. వారందరికీ కండువాలు వేసి పార్టీలోకి ఎమ్మెల్యే ఆహ్వానించారు.

కళా పరిషత్ అధ్యక్షుడిగా శివ

గరివిడి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): గరివిడిలో కళాపరిషత్ మండల అధ్యక్షుడిగా కంబాల శివ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కళాపరిషత్ ఆధ్వర్యంలో మే 9, 10, 11 తేదీల్లో గరివిడిలో అంతర రాష్ట్రాల నాటక పోటీలను నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో 30 ఏళ్లుగా నాటక పోటీలపై పూర్తిస్థాయిలో అవగాహన ఉన్న శివను అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఘనంగా ఆలయ ప్రారంభోత్సవాలు


విజయనగరం: పెద్దపల్లివీధిలో..


అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే లలితకుమారి


పూజలు అందుకుంటున్న షిర్డీసాయిబాబా

విజయనగరం రింగురోడ్డు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పెద్దపల్లివీధిలోని సీతారామ, ఉమా మహేశ్వర, సాయినాథ ఆలయాల పునః ప్రారంభోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచే పూజాదికాలు మొదలయ్యాయి. మధ్యాహ్న భక్తులకు అన్న సమారాధన చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు చిన్నారావు, సత్యనారాయణ, శ్రీనివాసరావు, ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠోత్సవం

● కొత్తవలస: మండలంలోని దేవాడ, ముసిరాం గ్రామాల మధ్యలోని రామలింగపురం తోటలో నిర్మించిన ఆలయంలో దుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేదపండితుడు అంపోలు ఉమామహేశ్వరశర్మ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారిని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, టీడీపీ కార్య నిర్వాహక రాష్ట్ర కార్యదర్శి రాంప్రసాద్, నాయకులు బొబ్బిలి అప్పారావు, కోళ్ల వెంకటరమణ, పీవీ రత్నాజీ, కె.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

దేశాలమ్మకు పూజలు

●సంతకవిటి: మండలంలోని బొద్దూరులో గ్రామదేవత దేశాలమ్మ తల్లి ఉత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మ వారిని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ దర్శించుకున్నారు. అమ్మవారి ఆశీస్సులు మనందరిపై ఉండాలని ఆకాంక్షించారు. నియోజకవర్గం వాణిజ్య విభాగం అధ్యక్షుడు, బొద్దూరు ఎంపీటీసీ సభ్యుడు వల్లూరు గణేష్ ఆధ్వర్యంలో నిర్వహిం చిన కార్యక్రమంలో తూర్పుకాపు మాజీ చైర్మన్ కొల్ల అప్పలనాయుడు, గట్టి భాను, వల్లూరు బాబురావు, చెలికాని మహేష్‌బాబు, సమతం శ్రీను, కిమిడి అశోక్‌బాబు, పిన్నింటి మోహనరావు ఉన్నారు.

● లక్కవరపుకోట: మండలంలోని గొట్లాం గ్రామంలో గల షిర్డీసాయిబాబా ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్త తూర్పాటి రామకృష్ణ భక్తులకు ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేశారు.

అక్కినేని శత జయంతి వేడుకలు ప్రారంభం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నిర్వాహకులు

విజయనగరం రూరల్/బాబామెట్ట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు దివంగత అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి వేడుకలు ఆదివారం గురజాడ కళాభారతిలో ఘనంగా ప్రారంభమయ్యాయి. అక్కినేని సాంస్కృతిక సమాజం రజతోత్సవంలో భాగంగా నిర్వహిస్తున్న వేడుకల్లో తొలుత అక్కినేని నాగేశ్వరరావు నటించిన పలు చిత్రాల్లోని సన్నివేశాలు, చిత్రాలు తెరపై ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి చల్లా రాంబాబు అధ్యక్షత వహిం చారు. అక్కినేని సాంస్కృతిక సమాజం ఏర్పాటు, నిర్వహించిన కార్యక్రమాలను ఆయన వివరించారు. కార్యక్రమంలో గవర సత్తిబాబు, కుసుమంచి సుబ్బారావు, రౌతు వాసుదేవరావు, ఈపు విజయ్‌కుమార్, దిబ్బ శంకరరావు, టి.మహేశ్వరరావు, శొంఠినేని కిషోర్, వైవీ సత్యనారాయణ, కట్టమూరి సుబ్రహ్మణ్యం తదితరులు హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా సహజ సంస్థ (విజయనగరం), అక్కినేని సాంస్కృతిక సమాజం సంయుక్తంగా 'రాయి' సాంఘిక నాటికను ప్రదర్శించారు. మంద రమేష్, వి.సత్యనారాయణ, కె.కృష్ణారావు, పి.ఆనందకుమార్, టి.బంగారునాయుడు, కెల్ల పైడిరాజు, డి.శంకరరావు, పి.తవిటినాయుడు, కోనేటి సత్యనారాయణ నటనతో ప్రేక్షకులను మెప్పించారు. నాటికకు గంటా సత్యనారాయణ దర్శకత్వ వహించగా, డి.మురళీధర్ సంగీతం అందించారు. శతజయంతి వేడుకల్లో రెండో రోజు సోమవారం కనకపుష్యరాగం నాటిక ప్రదర్శించనున్నారు.

చంపావతిలో మునిగి వ్యక్తి మృతి

క్రైంన్యూస్

నెల్లిమర్ల, మార్చి 2(ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల నుంచి రామతీర్థం వెళ్లే రోడ్డులో చంపావతి వంతెన వద్ద నీటిలో తేలుతున్న ఓ వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు ఆదివారం గుర్తించారు. మృతదేహం విజయనగరం స్టేడియంపేటకు చెందిన మాత అప్పారావుగా పోలీసులు గుర్తించారు. బీరువాలకు పెయింటింగ్ చేస్తూ జీవనం సాగిస్తున్న అప్పారావు రెండు రోజుల క్రితం పనికోసం జరజాపుపేట వెళుతున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లారని అతడి భార్య రమణమ్మ పోలీసులకు తెలిపింది. చంపావతిలో స్నానానికి దిగి ఈత రాక ప్రమాదవశాత్తు మృతి చెంది ఉంటాడని ఆమె వారికి చెప్పింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయనగరం సర్వజన ఆసుపత్రికి తరలించారు. మృతుడు అప్పారావుకు భార్య, ఒక వివాహిత కుమార్తె ఉన్నారు. ఘటనపై నెల్లిమర్ల ఎస్ఐ బి.గణేష్ కేసు నమోదు చేశారు.

పెదమానాపురంలో వరి కుప్పలు దగ్ధం


మంటలను అదుపు చేస్తున్న దృశ్యం

దత్తిరాజేరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): పెదమానాపురంలోని శివాలయం వద్ద దుద్ది రమణ, చుక్క రాము, సబ్బి మంగమ్మ, చిల్ల ఈసులకు చెందిన వరి కుప్పలు ఆదివారం దగ్ధమయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. రైతులు తాము నిల్వ ఉంచుకున్న తిండి గింజలు కోల్పోయామని ఆవేదన చెందారు.

పూరిల్లు దగ్ధం



విజయనగరం క్రైం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఉడాకాలనీ ఫేజ్-2లో ఆదివారం తెల్లవారు జామున జరిగిన అగ్ని ప్రమాదంలో ఆర్.ఎర్రయ్యకు చెందిన పూరిల్లు దగ్ధమైందని జిల్లా అగ్నిమాపక శాఖ సహాయ అధికారి కె.సోమేశ్వరరావు తెలిపారు. కూలీ పనిచేసుకుంటూ జీవనం సాగించే ఎర్రయ్య పూరిల్లు అగ్ని ప్రమాదానికి గురైందనే సమాచారం మేరకు అక్కడకు చేరుకుని మంటలు అదుపులోకి తీసుకువచ్చామన్నారు. ఆస్తి నష్టం రూ.4 లక్షల మేర ఉంటుందని ఆయన తెలిపారు.

101 మద్యం సీసాల స్వాధీనం

నెల్లిమర్ల, మార్చి 2(ఆంధ్రజ్యోతి): పారసాంలో మద్యం బెల్ట్ దుకాణంపై ఆదివారం దాడులు నిర్వహించి 101 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ బి.గణేష్ తెలిపారు. మద్యం విక్రయాలు అక్రమంగా జరుగుతున్నాయనే సమాచారం మేరకు దాడి చేశామన్నారు. దుకాణం నిర్వాహకుడిని అరెస్టు చేశామని ఎస్ఐ తెలిపారు.

నేటి నుంచి తెరుచుకోనున్న జూట్ మిల్లు

● కార్మికులకు యాజమాన్యం ఆహ్వానం


నెల్లిమర్ల జూట్ మిల్లు ఇదే..

నెల్లిమర్ల, మార్చి 2(ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల జూట్ మిల్లు ఎట్టకేలకు తెరుచుకోనుంది. గత ఏడాది జూన్ 12న నార కొరత పేరిట మూతపడిన జూట్ మిల్లును తిరిగి తెరిచేందుకు యాజమాన్యం ముందుకు వచ్చింది. 8 నెలల అనంతరం ఈనెల 3 నుంచి మిల్లులో నిర్వహణ పనులకు యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. ఫిబ్రవరి 10న విశాఖలో కార్మికశాఖ అధికారుల సమక్షంలో జరిగిన చర్చల్లో మార్చి తొలివారంలో మిల్లును తెరుస్తామని యాజమాన్య ప్రతినిధులు అప్పట్లో మౌఖికంగా అంగీకరించారు. నిర్వహణ పనులకు హాజరు కావాల్సిన కార్మికుల పేర్లను నోటీసు బోర్డులో పెట్టారు. మిల్లుకు ప్రస్తుతం విద్యుత్ సరఫరా రాలేదు. విద్యుత్ సరఫరా కూడా రెండు రోజుల్లో రావచ్చని అందుకు సంబంధించిన ఏర్పాట్లను యాజమాన్యం చేసుకుందని సమాచారం. సుమారు 2 వారాల పాటు మెంటినెన్స్ పనులు జరిగే అవకాశం ఉంది. ఆ తరువాత ఉత్పత్తి ప్రారంభమయ్యే అవకాశం ఉంది. మిల్లు మూతపడే ముందు పర్మినెంట్, బదిలీ, డైలీ వేజ్ కార్మికులు మొత్తం రోజుకు 1500 మంది విధులకు హాజరయ్యేవారు. మిల్లు తెరిచేందుకు యాజమాన్యం నిర్ణయం తీసుకోవడంతో కార్మికుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

రాష్ట్ర కమిటీ ఎన్నిక బహిష్కరణ


ఎన్నికను బహిష్కరించిన శిష్టకరణ ప్రతినిధులు

విజయనగరం దాసన్నపేట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): విశాఖలోని ప్రేమసమాజంలో ఆదివారం నిర్వహించిన శిష్టకరణ సంఘం రాష్ట్ర కమిటీ ఎన్నికలో ఐదు జిల్లాల ప్రతినిధుల ఏకాభిప్రాయం కుదరలేదు. దాంతో శిష్టకరణ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.జయప్రకాశ్‌నారాయణ ఆధ్వర్యంలో ఉత్తరాంధ్రకు చెందిన ఐదు జిల్లాల ప్రతినిధులు ఎన్నికను బహిష్కరించారు. ఆదివారం విశాఖపట్నంలో నిర్వహించిన అత్యవసర సమావేశంలో జయప్రకాశ్‌నారాయణ మాట్లాడుతూ ఈ నెల 23న విజయనగరంలో శిష్టకరణ సంఘం ఆధ్వర్యంలో ఐదు జిల్లాల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకునేందుకు కార్యాచరణ రూపొందించామన్నారు. ఎన్నికలను నిబంధనల ప్రకారమే నిర్వహిస్తామన్నారు. సమావేశంలో శిష్టకరణ సంఘం ప్రతినిధులు సదాశివుని కృష్ణ, ఎంవీ గౌరీశ్వరరావు, జి సుధాకరరావు, రమణ, వెంకటేష్, రేగా సురేష్, డి.ప్రసాద్ పాల్గొన్నారు.

7న ఎల్లమ్మతల్లి సిరిమానోత్సవం


మాట్లాడుతున్న కమిటీ ప్రతినిధులు

విజయనగరం రూరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): సిరులతల్లి ఎల్లమ్మ తల్లి ఉత్సవాల్లో భాగంగా ప్రభుత్వ సంగీత కళాశాల ఎదుట ఉన్న ఆలయం వద్ద ఈనెల 7న సిరిమానోత్సవం నిర్వహించనున్నట్లు సిరిమాను అధిరోహకుడు చందక త్రినాథ్ తేజ, కమిటీ ప్రతినిధులు డి.అప్పారావు, సీహెచ్.నూకరాజు, రామపైడి, లోగిశ రామకృష్ణ, మద్దిల సోంబాబు తెలిపారు. ఆదివారం ఆలయం ఎదుట ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తొలేళ్ల, సిరిమానోత్సవానికి సంబంధించి భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. భక్తులు విజయవంతం చేయాలని కోరారు.

నిర్వహణ లేక.. చెట్ల కొమ్మలు తొలగించక

● గాలులు వీస్తే ప్రమాదం జరిగే అవకాశం

● ఇదీ భోగాపురంలో విద్యుత్ కండక్టర్ వైర్ల పరిస్థితి



కొమ్మల మధ్యలో ఉన్న కండక్టర్ వైర్లు

భోగాపురం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): భోగాపురం సొసైటీ కార్యాలయం ఎదుటగల చెట్ల కొమ్మల్లో విద్యుత్ కండక్టర్ వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. కండక్టర్ వైర్లు కొన్నేళ్లుగా చెట్ల మధ్యలో కొమ్మలపై నుంచి వెళ్తున్నాయి. ప్రధానంగా ట్రాన్స్‌కో సిబ్బంది నిర్వహణ లేకపోవడంతోపాటు ఇక్కడ చెట్ల కొమ్మలు ఎప్పటికప్పుడు తొలగించడం లేదని స్థానికులు వాపోతున్నారు. కండక్టర్ వైర్లు కొద్దేళ్లుగా చెట్ల మధ్యలో కొమ్మలపై ఉన్నాయి. ప్రస్తుతం వైర్లు కలిసి ఉండడంతో గాలులు వీచే సమయంలో ఒకదానికొకటి తగిలి, చెట్ల కొమ్మలు విరిగితే కండక్టర్ వైర్లు తెగిపోయి కింద పడితే ప్రమాదం జరిగే అవకావముందని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. భోగాపురంలో ప్రధాన జంక్షన్‌కావడంతోపాటు నిరంతరం వందలాది మందితో ఈ మార్గం రద్దీగా ఉంటోంది. ఇక్కడి పరిస్థితి ట్రాన్స్‌కో సిబ్బందికి ఫిర్యాదుచేసినా పట్టించుకోవడంలేదని సొసైటీ సిబ్బంది వాపోతున్నారు. తక్షణమే కండకర్టర్ వైర్లు తొలగించేలా చర్యలు తీసుకో వాలని స్థానికులు, సొసైటీ సిబ్బంది కోరుతున్నారు.

బొబ్బిలిలో మాజీ సైనికుల సమావేశం

బొబ్బిలి/రూరల్, మార్చి2 (ఆంధ్రజ్యోతి):పాతకోటలో గల మాజీ సైనికుల కార్యాలయంలో బొబ్బిలి మాజీ సైనికోద్యోగుల సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం గౌరవాధ్యక్షుడు మరడ రామినాయుడు ఆధ్వర్యంలో అధ్యక్షుడు రేవళ్ల కిరణ్‌కుమార్ పర్యవేక్షణలో ఆదివారం జరిగింది. ఈసందర్భంగా సంఘం పద్దులు, జమాఖర్చుల వివరాలపై, భవిష్యత్ ప్రణాళికలపై విధివిధానాలపై సభ్యుల అభిప్రాయాలను సేకరించారు. ఈ సందర్భంగా గౌరవాధ్యక్షుడు మాట్లాడుతూ ప్రతిసభ్యుడూ సమావేశాలకు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎ.గోవిందనాయుడు, జాయింట్ కార్యదర్శి రవీంద్ర మోహన్, ట్రెజరర్ పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



షాపు యజమానులతో మాట్లాడుతున్న ఎస్ఐ ప్రసాదరావు

రామభద్రపురం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): దొంగతనాలు నిరోధించడానికి ప్రతి షాపు యజమాని సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్ఐ వెలమల ప్రసాద్ సూచించారు.ఆదివారం మండలంలోని ఆరికతోటలో షాపు యజమానులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఇటీవల ఎక్కువగా దొంగత నాలు జరుగుతున్న దృష్ట్యా షాపు యజమానులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. సీసీ కెమెరాలు ఏర్పాటుచేస్తే దొంగతనం జరిగితే గుర్తించడానికి అవకాశం ఉంటుందన్నారు. సీసీ కెమెరాల డేటా అప్‌డేట్‌గా ఉండాలన్నారు.నిర్మానుష్యమైన ప్రదేశంలోఉన్న షాపు జయమానులకు సీసీ కెమెరాలు ఎంతో అవసరమని తెలిపారు. షాపుయజమానులు అవసరమైతే వాచ్‌మెన్‌ను నియమించుకోవాలని సూచించారు. సమావేశంలో కానిస్టేబుళ్లు రవికుమార్, సురేంద్ర పాల్గొన్నారు.

తెర్లాంలో 'చదవడం మాకిష్టం'



గ్రంథాలయంలో చదువుతున్న విద్యార్థులు

తెర్లాం, మార్చి 2(ఆంధ్రజ్యోతి):చిన్ననాటి నుంచే పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని స్థానిక శాఖా గ్రంథాలయ అధికారి సీహెచ్ కృష్ణమూర్తి తెలిపారు.ఆదివారం తెర్లాం శాఖాగ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పిల్లలకు నైతిక విలువలు నేర్పించే పుస్తకాలు చదివించారు. పద్యాలు పాడించడంతోపాటు అలీబాబా 40 దొంగలు, అరేబియన్ నైట్ కథలు, డాక్టర్ జాకీర్ హుస్సేన్, అల్లూరి సీతారామరాజు కథలు, వ్యాసరచనలు, పురాణాలు, ఇతిహాస కథలు గ్రంథాలయంలో చదివించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పుస్తకాలతో జ్ఞానం పెరుగుతుందని, మెదడుకు మేతలాగాఉంటుందని పిల్లలు రోజు పుస్తకాలు చదవడం అలవాటుచేసుకోవాలని కోరారు.

హామీని నిలబెట్టుకున్న ప్రభుత్వం

బొబ్బిలి, మార్చి2 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృ త్వంలోని ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆదరణ పథకాన్ని పునరుద్ధరించి హామీని నిలబెట్టుకుందని విజయనగరం పార్లమెంట్ టీడీపీ బీసీ విభాగం నాయీబ్రాహ్మణ సాధికార కమిటీ ప్రతినిధి చిలకలపల్లి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో ఆదివారం పేర్కొన్నారు. ఆదరణ పథకానికి బడ్జెట్‌లో వెయ్యి కోట్ల రూపాయలు కేటాయించడంతో చేతివృత్తుల వారికి ఎంతోభరోసా కల్పించినట్లయిందనితెలిపారు. నాయీ బ్రాహ్మణులకు నెలకు ఉచితంగా 200 యూ నిట్లు విద్యుత్ ఇస్తామని ప్రకటించారని పేర్కొన్నారు. టీటీడీ పాలకమండలిలో నాయీ బ్రాహ్మణులకు స్థానం కల్పించడం, ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడం వంటి చర్యలు తమకు సముచితస్థానం కల్పించినట్లయిందని తెలిపారు. అన్ని బీసీ వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేయడం సంతోషదాయకమని పేర్కొన్నారు.

ఆప్తాల్మిక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వసంతరావు

తెర్లాం, మార్చి2(ఆంధ్రజ్యోతి):పెరుమాళి ఆప్తాల్మిక్ అధికారి సప్పటి వసంత రావు ఆప్తాల్మిక్ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. విజయవాడలోని ఏపీ ఎన్జీవో హోం సమావేశ భవనంలో ఆదివారం రాష్ట్ర ఆప్తాల్మిక్ అధికారుల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా నియమించినట్లు వసంతరావు తెలిపారు. ఈసందర్భంగా వసంతరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని పారామెడికల్ ఆప్తాల్మిక్ అధికారులకు పదోన్నతులు కల్పించాలని,అంధత్వ లక్ష్యసాధనకు లక్షజనాభాకు ఒక ఆప్తాల్మిక్ అధికారిని నియమించాలని కోరారు. జీవో-143 ప్రకారం ఆప్తాల్మిక్ అధికారుల కేడర్ సమస్య పరిష్కరించాలని డిమాండ్‌చేశారు.

బొబ్బిలిలో చోరీ

బొబ్బిలి, మార్చి2(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని సాయిశార్వాణి టౌన్‌షిప్‌లో మాజీ కౌన్సిలరు పిల్లా సుజాతరామారావు ఇంట్లో శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత చోరీ జరిగింది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. ఇంట్లో ఎవరూలేని సమయంలో ముందుభాగంలో గల సీసీ కెమెరాను దుండగులు గోనెసంచితో కప్పేసి లోపలికి వెళ్లేందుకు నాలుగు వైపులా ప్రయత్నించిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయి.రూ.16 వేలు నగదుతోపాటు, భవన నిర్మాణానికి వినియోగించే డ్రిల్లింగ్, కటింగ్ మిషన్లు, కొన్ని యంత్రాలను ఎత్తుకుపోయారు.ఇంటితాళాలను పగులగొట్టి లోపలికి ప్రవేశించి బీరువాలో దుస్తులు, సామగ్రిని చిందరవందరగా పడేశారు. క్యాంపులోఉన్న ఇంటి యజమాని వచ్చిన తర్వాత ఇంకేమైనా పోయాయోమోనని తెలుస్తుంది.ఏఎస్ఐ బీటీ రమణ సిబ్బందితో ఘటనాస్థలానికి వెళ్లి పరిశీలించారు. నిందితుల కోసం గాలిస్తున్నామని ఆయన తెలిపారు.

సర్వే చేశారు.. వదిలేశారు..

● ఆక్రమణలు గుర్తించినా తొలగించని అధికారులు

● ఇదీ మదనాపురం నీలకంఠరాజు చెరువు పరిస్థితి



ఆక్రమణకు గురైన నీలకంఠరాజు చెరువు

గంట్యాడ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మదనాపురం నీలకంఠరాజు చెరువు కబ్జాదారుల కోరల్లో చిక్కుకుంది. వందలాది ఎకరాల నీరందించే ఈ చెరువులో ఆక్రమణల గుర్తింపునకు సర్వేచేసి, అధికారులు హద్దులు నిర్ధారించారు. తర్వాత అధికారులు ఆక్రమణల తొలగింపు విషయంలో ఒక్క అడుగూ ముందుకువేయలేదు. సర్వేతో చేతులుదులుపుకొన్నారు.

ఇదీ పరిస్థితి

సర్వేనెంబరు ఐదులోని మదనాపురం నీలకంఠరాజు చెరువు 33.2 ఎకరాలు విస్తీర్ణంలో విస్తరించి ఉంది. ప్రస్తుతం ఆక్రమణదారుల పుణ్యమాని చెరువు గర్భంలో ఐదెకరాలు మాత్రమే మిగిలిఉంది. ఈనేపథ్యంలో చెరువు ఆక్రమణకు గురైనట్లు రెవెన్యూ అధికారులు గుర్తించి రెండేళ్ళ అవుతునా ఇప్పటి వరకూ ఈ విషయంలో ఒక్క అడుగు ముందుకు పడలేదు. 2023 జూన్‌లో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అమలుచేసే ఆజాదీ అమృతమహోత్సవాల్లో భాగంగా నీలకంఠరాజు చెరువును అభివృద్ధి చేయడం కోసం అప్పట్లో ప్రభుత్వం ఉత్తర్వులు వెలువరించింది. చెరువు అభివృద్ధి బాధ్యతలను విశాఖనుంచి రాయపూర్ వరకూ నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ రహదారికి సంబంధించిన ఓ ప్రైవేటు సంస్థకు అప్పగించారు. అప్పటిలో విజయనగరం ఆర్డీవోగా పనిచేసిన భవానీ శంకర్ చెరువును పరిశీలించారు. చెరువు గర్భం ఆక్రమణకు గురైనట్లు గుర్తించారు. గర్భం సుమారు రెండెకరాలు మినహా మిగిలిన మొత్తంలో అరటి, బొప్పాయి, మామిడి పంటలను సాగుచేస్తున్నారు. సర్వేచేసి ఆక్రమణలు తొలగించాలని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు అప్పటిలో ఆదేశాలిచ్చారు. వెంటనే గ్రామసర్వేయర్లు, ఇరిగేషన్ సిబ్బంది చెరువు వద్దకు వెళ్లి సర్వే చేపట్టారు. ముందుగా చెరువు సరిహద్దులను నిర్ధారించి రాళ్లు పాతారు. తరువాత ఇరిగేషన్ అధికారులు చెరువు చుట్టు యంత్రాలతో ట్రెంచ్ కొట్టారు. కాని ఇప్పటి వరకూ చెరువు ఆక్రమణల తొలగించడానికి కార్యాచరణ రూపొందించలేదు.

నీరు-చెట్టు పథకం కింద పనులు

తాటిపూడి రిజార్వాయర్ కింద ఉన్న ఈ చెరువుకు 2018లో ఇరిగేషన్ ఆధ్వర్యంలో నీరు-చెట్టు పథకం కింద నిధులు మంజూరయ్యాయి. ఆక్రమణకు గురికాని గర్భంలో మాత్రమే నీరు-చెట్టు కింద ఇరిగేషన్ అధికారులు పనులు చేయించారు. అయితే అప్పట్లో చెరువు ఆక్రమణకు గురైనట్లు గుర్తించకపోవడం విశేషం. చెరువు గర్భం ఆక్రమించి సాగు చేస్తున్న కొంతమంది షెడ్లు నిర్మించి బోర్లు తవ్వారు. విద్యుత్‌లైన్లు కూడా ఏర్పాటు చేసుకున్నారు. ఇందులో ఓ రైతుకు గతంలో ఐదెకరాలు భూమికి అప్పటిలో పట్టా ఇచ్చినట్లు తెలుస్తోంది. చెరువు గర్భంలో రెవెన్యూ అధికారులు పట్టా ఎలా ఇస్తారని మరికొంతమంది ప్రశ్నిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఆక్రమణలు తొలగించి చెరువును పరిరక్షించాలని మదనాపురం రైతులు కోరుతున్నారు.

చెరువు ఆక్రమణలు గుర్తించాం

చెరువు ఆక్రమణలు గుర్తించామని తాటిపూడి ఇరిగేషన్ జేఈ వి.తమ్మినాయుడు తెలిపారు.ఇందులో ఒక రైతుకు రెవెన్యూ అధికారులు పట్టా ఇచ్చారని ఉద్దేశంతో కోర్టుకు వెళ్లారని చెప్పారు. రెవెన్యూ అధికారులు, తాము కలిసి కోర్టులో కౌంటర్ వేసినట్లు తెలిపారు. మిగిలిన రైతులు నుంచి తాము భూమిని స్వాధీనం చేసుకుంటామని చెప్పారు.పూర్తి స్థాయిలో ట్రెంచ్ కొట్టడానికి నిధులు అవసరమని, ఈ విషయం ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు.

కాలువలు తవ్వారు.. తాగు నీరు మరిచారు

● దిష్టిబొమ్మల్లా మారిన కొళాయిలు ● ఇదీ ఎం.పణుకువలసలో పరిస్థితి



దిబ్బగుడ్డివలసలో పాడైన చేతిపంపు



ఎం.పణుకువలసలో దిష్టిబొమ్మలా మారిన కొళాయిలు

బొబ్బిలి రూరల్,మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.పణుకువలసలో కాలువల నిర్మాణానికి తవ్వకాలు చేపట్టడంతో జలజీవన్ మిషన్ కింద వేసిన పైపులైన్లు దెబ్బతిన్నాయి. దీంతో ఆ గ్రామస్థులకు తాగునీరందడం లేదు. ఈ నేపథ్యంలో లక్షలాది రూపాయల వ్యయంతో ఏర్పాటుచేసిన కొళాయి కనెక్షన్లు నిరుపయోగంగా మారాయి. ఎం.పణుకువలసలో జలజీవన్‌మిషన్ పథకం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి నిధులతో ఇంటింటికీ నీరందించేందుకు కొళాయిలు ఏర్పాటుచేశారు. కొంతకాలంగా సక్రమంగా నీరందేది. ఈ నేపథ్యంలో కాలువల ఏర్పాటుకోసం సీసీరోడ్లకు ఇరువైపులా తవ్వారు.దీంతో పైపులైన్లు పాడయ్యాయి. నెలలు గడుస్తున్నా పైపులైన్లు పునరుద్ధరించి తాగునీటిని సరఫరా చేయడం అధికా రులు మరచిపోయారు.ప్రస్తుతం మార్చి మొదటి వారంలో ఎండలు తీవ్రత పెరగ డంతో దాహంకేకలు మిన్నంటుతున్నాయి.ఈనేపథ్యంలో తక్షణమే కొళాయిలద్వారా నీరందించే ఏర్పాట్లుచేయాలని మహిళలు కోరుతున్నారు. కాగా గ్రామంలో కా లువలు తవ్వడం వల్ల పైప్‌లైన్లు దెబ్బతిన్నాయని, సరిచేసి తాగునీరందిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రవణకుమార్ తెలిపారు.

మరమ్మతుకు నోచుకోని చేతిపంపు

మండలంలోని దిబ్బగుడ్డివలస మొదటివీధిలో ఉన్న చేతిపంపు మరమ్మతులకు నోచుకోవడంలేదు. ఈవిషయం పలుసార్లు సచివాలయంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని పలువురు వాపోతున్నారు. ఆ చేతిపంపపై చుట్టుపక్కల 15 కుటుంబాలు ఆధారపడేవి. కాగా క్రాష్ ప్రోగ్రాం గ్రామాల్లో ప్రారంభించామని, త్వరలో చేతిపంపు మరమ్మత్తులు చేపట్టి నీటి సమస్యను పరిష్కరిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రావణకుమార్ తెలిపారు.

గోవుల ఘోష

(5వ పేజీ తరువాయి)

కరువైంది. మార్కెట్‌ల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన ఎప్పటి నుంచో ఉంది. కానీ అమలు కావడం లేదు. సంతకు వచ్చే పశువులకు నీల తొట్లెలు, గడ్డివాములు ఏర్పాటు చేయాలి. పశు వైద్యుల సూచన మేరకు కాలి నడకన పశువులను తరలించాలి. వాహనాల్లో ఇతర ప్రాంతాలకు పశువులను తరలిస్తే ఒకటి లేదా రెండు పశువులకు మాత్రమే అనుమతి ఉంది. గజపతినగరం సర్కిల్ పరిధిలో వాహనాల తనిఖీల్లో అనేకసార్లు కేసులు నమోదవుతూ వస్తున్నాయి. 2024 సంవత్సరంలో గజపతినగరంలో 2, బొండపల్లిలో 2, పెదమానాపురంలో 21, స్టేషన్ బూర్జివలసలో 6 కేసులు నమోదయ్యాయి. 2025లో జనవరి, ఫిబ్రవరి నెలల్లో బొండపల్లిలో 2, పెదమానాపురంలో 6, స్టేషన్ బూర్జివలసలో 3, గజపతినగరం పోలీస్‌స్టేషన్‌ల్లో 2 కేసులు నమోదయ్యాయి.

ఆటో ఎక్కించి.. గొలుసు చోరీ చేసి

● కారాడలో వృద్ధురాలి మెడలో నుంచి బంగారం అపహరణ

బొబ్బిలి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కారాడలో వృద్ధురాలు చొక్కాపు గౌరమ్మ మెడలోనుంచి తులంన్నర బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు.సీఐ కటుకంసతీష్‌కుమార్ కథనం మేరకు..పొలంలో పనులు ముగించుకుని గౌరమ్మ ఆదివారం మధ్యాహ్నం ఇంటికి నడుచుకొని వస్తోంది. అదే సమయంలో గౌరమ్మను ఎదురుగా వస్తున్న ముగ్గురు వ్యక్తులు బలవంతంగా ఆటో ఎక్కించారు. వెంటనే ఆమె మెడలో నుంచి బంగారు గొలుసును తెంచుకొని ఆటోలో నుంచి బయటకు నెట్టేశారు. ఏమి జరిగిందో తెలుసుకునేలోగా మెడలోని బంగారు గొలుసు మాయం కావడాన్ని గౌరమ్మ గుర్తించింది. తన భర్త గౌరునాయుడు, కుటుంబ సభ్యులకు చోరీ జరిగినవిషయాన్ని చెప్పడంతో వారు బొబ్బిలి పోలీసులను ఆశ్రయించారు. సీఐ సతీష్‌కుమార్, ఎస్ఐ ఆర్.రమేష్, ఏఎస్ఐ బీటీ రమణ ఇతర సిబ్బంది హుటా హుటిన ఘటనాస్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. ఆ సమయంలో ఆటోలో ఓ మహిళతో పాటు ఇద్దరు బాలలు ఉన్నట్లు గౌరమ్మ చెబుతోంది. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నామని సీఐ సతీష్‌కుమార్ తెలిపారు.

చేనేత, హస్తకళలను ప్రోత్సహించండి

విజయనగరం దాసన్నపేట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): చేనేత, హస్తకళలను ప్రోత్సహించి కార్మికులకు ఉపాధి కల్పించాలని కళాభారతి చేనేత, హస్తకళా ప్రతినిధి ప్రసాద్ కోరారు. ఆదివారం విజయనగరంలోని లయన్స్‌క్లబ్‌లో అఖిల భారత హస్తకళ చేనేత వస్త్రప్రదర్శనను ఏర్పాటుచేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పోచంపల్లి, గద్వాల్, నారాయణపేట, మంగళగిరి, చీరాల, ఉప్పాడ, కంచి, ధర్మవరం ప్రాంతాలకు సంబంధించిన వస్త్రాలు, కొండపల్లి, ఏటికొప్పాక బొమ్మలు, జూట్ బ్యాగులను ప్రదర్శనలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

విద్యతో సమాజాభివృద్ధి

విజయనగరం దాసన్నపేట, మార్చి 2(ఆంధ్రజ్యోతి): విద్యతో సమాజాభివృద్ధి సాధ్యమని వన్‌టౌన్ ఎస్ఐ ప్రసన్నకుమార్ తెలిపారు. ఆదివారం విజయనగరంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ప్రజావికాస్ పరీక్ష నిర్వహించి విజేతలకు బహుమతి ప్రదానంచేశారు.కార్యక్రమంలో రవితేజ, యూటీఎఫ్ ప్రతినిధి ఈశ్వరరావు, ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు రాము, వెంకటేష్, రమేష్, జగదీష్, సోమేష్ పాల్గొన్నారు.

ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలి

నెల్లిమర్ల, మార్చి 2(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలని ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డీవీజీ శంకరరావు కోరారు. ఆదివారం నెల్లిమర్ల గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రమశిక్షణ, ఏకాగ్రతతో చదివి మంచి ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం కర్రి సూర్యనారాయణ పాల్గొన్నారు.

రోడ్డు సౌకర్యం లేక.. డోలీలో తరలించి

శృంగవరపుకోట రూరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిట్టంపాడు గిరిశిఖర గ్రామానికి చెందిన వృద్ధురాలు సీదరి అచ్చియమ్మను ఆదివారం ఆస్పత్రికి డోలీలో తరలించారు. అచ్చియమ్మ అనారోగ్యం బారినపడింది. దీంతో ఆమెను గ్రామస్థులు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో డోలీలో తీసుకువచ్చి ఎస్.కోట ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. కొండపై నుంచి ఏడు కిలోమీటర్లు దూరం డోలీలోనే తీసుకువచ్చి ఆసుపత్రిలో చేర్చామని గ్రామస్థులు తెలిపారు. తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం లేకపోవడంపై ఆవేదన వ్యక్తంచేశారు.

సత్తాచాటిన గర్భాం విద్యార్థులు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డీఈవో మాణిక్యం నాయుడు

మెరకముడిదాం, మార్చి2 (ఆంధ్రజ్యోతి): గర్భాం మోడల్ స్కూల్ విద్యార్థులు జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాస్థాయిలో నిర్వహించిన పోటీల్లో సత్తాచాటారు.ఈమేరకు ప్రథమస్థానంలో నిలిచారని ప్రిన్సిపాల్ డీవీవీఎస్ అరుణ తెలిపారు. క్విజ్ పోటీల్లో కె.జనని ప్రథమ స్థానం, టాలెంట్ టెస్ట్‌లో కె.వెంకటేష్ ప్రతిభ కనబరిచారని పేర్కొన్నారు.

రోడ్డు మధ్యలో స్తంభం.. రాకపోకలకు అగచాట్లు

● ఇదీ లంబఖండి పనసపేట వీధిలో పరిస్థితి



రోడ్డు మధ్యలో ఉన్న స్తంభం

రేగిడి, మార్చి 2(ఆంధ్రజ్యోతి):మండలంలోని అంబఖండి పనసపేటవీధిలో విద్యుత్ స్తంభం రోడ్డు మధ్యలో ఉండడంతో పాదచారులు, వాహనచోదకులు రాకపోకలకు అవస్థలకు గురవుతున్నారు. సీసీరోడ్డుకు మధ్యలో స్తంభం ఉండడంతో భారీ వాహనాలు వచ్చిపోయే సమయంలో, చీకటిపడిన తర్వాత ద్విచక్రవాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. స్తంభం రోడ్డు మధ్య నుంచి తొలగించాలని ఏపీఈపీడీసీఎల్ సిబ్బంది దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకో వడంలేదని అంబఖండి సర్పంచ్ లక్ష్మీగో విందరావు తెలిపారు. పంచాయతీ నుంచి స్తంభం మార్చడానికి చార్జీలు చెల్లించడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు మధ్య నుంచి స్తంభం తొలగించి అవస్థలు తీర్చాలని పలువురు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించండి

విజయనగరం రూరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు ఉద్యోగుల ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని యూనియన్ బ్యాంకు ఎంప్లాయీస్ అసోసియేషన్ రీజనల్ కార్యదర్శి ఆర్.రాజశేఖర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కారానికి దశలవారీ కార్యక్రమంలో భాగంగా సోమవారం పార్లమెంట్ ఎదుట నిరసన ప్రదర్శన, ఈనెల 24, 25 తేదీల్లో సమ్మెచేస్తామని పేర్కొన్నారు.

13 నుంచి గొల్లపేరంటాల జాతర

చీపురుపల్లి,మార్చి 2(ఆంధ్రజ్యోతి): మెట్టపల్లిలో గొల్లపేరంటాలు జాతర మహోత్సవాలు ఈనెల 13 నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఒకప్రకటనలో తెలిపింది. జాతర పురస్కరించుకుని సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొంది.

ఆంధ్రజ్యోతి
మా అక్షరం - మీ ఆయుధం
ఆంధ్రజ్యోతి దినపత్రిక చందాదారులుగా చేరాలన్నా, పత్రిక సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉన్నా, ఈ నెంబర్లకు సంప్రదించగలరు.
ACM : 9985411514, విజయనగరం : 9985411533
పార్వతీపురం : 9985403035, పాలూరు : 9492900300

